భూ కబ్జాకు యత్నించిన ఆరుగురి రిమాండ్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు

శంషాబాద్ రూరల్: భూకబ్జాకు యత్నించడంతో పాటు అడ్డువచ్చిన మహిళలతో అసభ్యంగా ప్రవర్తించి దాడి చేసిన ఘటనలో ఆరుగురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ కె.శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చొదరిగూడ రెవెన్యూలో మూసా అనే రియల్టర్ సుమారు 90 ఎకరాల్లో పలు రకాల పేర్లతో 16 వెంచర్లు చేశాడు. రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి వెంచర్లు చేసి ప్లాట్లు అమ్మేశాడు. అయితే రైతులకు పూర్తిగా డబ్బులు చెల్లించలేదు. గత ఏడాది రియల్టరు మూసా హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి ఈ వెంచర్లలో భూతగాదాలు పెరిగిపోయాయి. కొంతమంది వ్యక్తులు ప్లాట్ల హద్దురాళ్లు తొలగించి కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ వివాదం కొనసాగుతుండగా.. సోమవారం సాయంత్రం కొంతమంది వచ్చి డాక్టర్స్ కాలనీ ఫేజ్–3లో ఉన్న ప్లాట్ల హద్దురాళ్లు, ఫెన్సింగ్ తొలగించారు. అంతేకాకుండా ఈ భూమి చుట్టూ ప్రీకాస్టింగ్ వేసేందుకు యత్నించారు. సమాచారం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. దీంతో కబ్జారాయుళ్లు రెచ్చిపోయి మహిళలపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితులు డయల్ 100 కు ఫోన్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కబ్జాకు యత్నించిన ఎండీ అయూబ్, మల్చాల మోహన్‌రావు, మెండె కుమార్, నానవాల కుమార్‌యాదవ్, మన్నె ప్రవీణ్, మామిళ్ల మల్లేశ్‌ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనాథ్ పేర్కొన్నారు. మల్చాల నర్సింహా, నగేశ్‌యాదవ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. భూవివాదాలను కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని, వివాదాస్పద భూముల్లోకి వెళ్లవద్దని సూచించారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

హౌసింగ్‌బోర్డ్ కాలనీలో సమస్యల తిష్ట!

- ఓపెన్ నాలాల్లో చెత్తాచెదారం
- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని స్థానికుల విన్నపం


ప్రమాదకరంగా ఉన్న ఓపెన్ నాలా

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధి హౌసింగ్‌బోర్డ్ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. కాలనీ ఏర్పడి మూడు దశాబ్దాలు గడుస్తున్నా.. ప్రజలకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సుమారు 800 నివాస గృహాలు ఉన్నాయి. ఓ వైపు హైదరాబాద్ అభివృద్ధి పథంలో ముందుకెళ్తుండగా, ఈ కాలనీలో మాత్రం ఇప్పటికీ పల్లెటూరు వలే ఓపెన్ నాలాలు ఉండడం గమనార్హం. అధికారులు అభివృద్ధి ఉన్నచోటే పనులు చేస్తూ.. లేని చోట కనీసం కన్నెత్తి కూడా చూడరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీలో ఎక్కువశాతం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వలస ఉంటున్నారనే కారణంతో ఎమ్మెల్యే, ప్రకాశ్ గౌడ్, కార్పొరేటర్ తోకల


నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారం

శ్రీనివాస్‌రెడ్డి కూడా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఎక్కువ శాతం ఓపెన్ నాలాలు ఉన్నాయి. వందల సంఖ్యలో ఉన్న ఇండ్లల్లోని మురుగు నీరు నాలాల్లోనే విడిచిపెడుతున్నారు. కొన్నిచోట్ల మురుగునీరు నిల్వ ఉండడంతో సాయంత్రం దుర్వాసన వెదజల్లుతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవేగాకుండా ఓపెన్ నాలాల్లో చిన్నారులు పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. జీహెచ్‌ఎంసీ సిబ్బంది కనీసం నాలాల్లోని పూడికను తీసేందుకు కూడా రావడం లేదని, దీంతో ఎవరి ఇంటి ముందు వారే శుభ్రం చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని వారు వాపోతున్నారు. మరో వైపు వర్షాకాలంలో ఓపెన్ నాలాలు నిండి రోడ్లపై మురుగునీరంతా ఇండ్లల్లోకి వస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిదంచి ఓపెన్ నాలాలు తొలగించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్ నాలాలతో పరేషాన్..



హౌసింగ్‌బోర్డు కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా ఓపెన్ నాలాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. వాటిపై కప్పులు లేక భయంగానే దాటి ఇంట్లోకి రావాల్సి వస్తున్నది. చిన్నారులు కూడా అందులో పడిన సందర్భాలు ఉన్నాయి. ఓపెన్ నాలాలు లేకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తే బాగుంటుంది.

– వినోద్, స్థానికుడు

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నేతలు


మంత్రిని కలిసిన నేతలు శ్రీధర్ తదితరులు

శంషాబాద్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీధర్ ఆధ్వర్యంలో నేతలు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి బొకేను అందజేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు క్షేత్రస్థాయి నుంచి కృషి చేయాలని మంత్రి ఈ సందర్భంగా వారికి సూచించారు. ఆయన వెంట నాయకుడు అక్రమ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బాసిత్ బాబానగర్ పరిధిలోని ఖయ్యుంనగర్, జలాల్ బాబానగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని వారు కోరారు.

వృథాగా తాగునీరు..


ఫెబల్‌సిటీ ప్రధాన రహదారిపై పారుతున్న నీరు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ఫెబల్‌సిటీకి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రధాన పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరంతా వృథాగా పోతోంది. సిబ్బంది పక్కనే ఉన్న డ్రైనేజీ, కాలువల్లోకి కాకుండా ప్రధాన రోడ్డుపైకి మళ్లించడంతో వాహనాదారులు, పాదాచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్వరమే అధికారులు, సిబ్బంది స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

శంషాబాద్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుద చేయాలని ఏబీవీపీ నేతలు డిమాడ్ చేశారు. తహసీల్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ చాకలి మహేశ్, ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ ప్రదీప్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సర్కారు మారినా పరిస్థితులు మాత్రం మారలేదన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రూ. 5300 కోట్ల బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మణికంఠ, అఖిల్, చరణ్, భార్గవ్, పవన్, నవీన్, తిరుపతి, భార్గవి, చందు, శివ, చరణ్, సురేశ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది


లేఅవుట్‌లోని ప్రహరీని తొలగిస్తున్న సిబ్బంది

బండ్లగూడ: అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర హెచ్చరించారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి సికెందర్‌గూడ సర్వేనంబర్ 14,15,16 లో గల ప్రభుత్వ స్థలంలో వెలసిన అక్రమ నిర్మాణాలను మంగళవారం తెల్లవారుజామున పోలీసు బందోబస్తు మధ్య సిబ్బంది ప్రహరీ, డ్రైనేజీ లైన్, రోడ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అనుమతులు ఉన్న లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేయాలని, అలాగే అనుమతులు తీసుకున్న తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇదిలా ఉంటే ఆ


స్థలానికి సంబంధించిన ఫొటోలు చూపిస్తున్న వికార్ ముళ్ల

భూమి తమది అంటూ వికార్ ముళ్ల అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో అక్కడికి చేరుకొని మాట్లాడారు. నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టడం బాధకరమన్నారు. వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రాజేంద్రనగర్ ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ


కొప్పుల వెంకట్ రెడ్డి

అత్తాపూర్: రాజేంద్రనగర్ ఆర్డీఓగా కొప్పుల వెంకట్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఆర్డీఓ మల్లయ్య బదిలీపై వెళ్లడంతో అర్బన్ ల్యాండ్ స్పెషల్ సీలింగ్ కలెక్టర్‌గా, రంగారెడ్డి జిల్లా ఎస్‌డీసీ బ్రాకెట్ యూఎస్‌సీ రంగారెడ్డి జిల్లాలో విధులు నిర్వహించిన వెంకట్ రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



అత్తాపూర్: ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని (60) ఏళ్ల వృద్ధుడు మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఏఎస్ఐ మహ్మద్ ఆర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లర్ నంబర్ 162 పాండురంగానగర్ సమీపంలో ఉన్న గోశాల వద్ద వృద్ధుడు అనారోగ్యంతో పడి ఉన్నాడు. దీంతో గోశాల ఇన్‌చార్జి శ్రీధర్ చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

మృతదేహం లభ్యం



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లర్ నంబర్ 240 వద్ద మంగళవారం సుమారు (55) ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని వారు సూచించారు.

వైభవంగా రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతం నానక్‌రాంగూడలో వెలసిన రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణ, భక్తుల జయజయధ్వానాలతో ఆలయమంతా భక్తిభావనతో నిండిపోయింది. ముఖ్యంగా ఆలయంలో రంగనాథస్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి అలంకారం చేశారు. అంతకుముందు ఆలయంలో ఉదయం ఆలయంలో బాలబోగం, అర్చన, బలిహరణ, ఆరాధన వంటి పూజలను నిర్వహించారు. అనంతరం అర్చకులు, భక్తులు సంయుక్తంగా సామూహిక విష్ణు సహస్రనామ పారాయణంలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించడంతోపాటు స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు.

దశలవారీగా హామీల అమలు


బృందావన్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్
- బృందావన్ కాలనీలో పర్యటన

మైలార్‌దేవ్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేయిస్తానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, స్ట్రీట్ లైట్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై వెంటనే ఎస్టిమేషన్ వేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు టి ప్రేమ్‌గౌడ్, సరికొండ వెంకటేశ్, రఘుయాదవ్ రాముయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ అరెస్టు

- శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- అక్కడి నుంచి షాద్‌నగర్ కోర్టుకు


వాహనంలో నవీన్‌కుమార్‌రెడ్డిని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

శంషాబాద్ రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జడ్పీ మాజీ వైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డిని అతని స్వగ్రామంలో మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకొని శంషాబాద్ ఠాణాకు తీసుకొచ్చారు. నందగామ మండలానికి చెందిన ఇతనిపై పలు కేసులు నమోదైనట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు స్టేషన్ వద్దకు రావడంతో ఉద్రిక్తత చోటు చేసుకున్నది. దీంతో అధికారులు ముందు జాగ్రతగా పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో బలగాలను మోహరించి, స్టేషన్‌లోకి ఇతరులను అనుమతించలేదు. 11.30 గంటల సమయంలో నవీన్ కుమార్‌రెడ్డి బంధువులు, న్యాయవాదులతో కలిసి ఠాణాకు వచ్చారు. ఇదే సమయంలో ఏసీపీ కె. శ్రీనివాస్‌రావు స్టేషన్‌కు వచ్చి నవీన్ కుమార్‌రెడ్డితో మాట్లాడారు. కాసేపటికే అతన్ని వాహనంలో షాద్‌నగర్ కోర్టుకు తరలించారు.

ఎందుకు అరెస్టు చేశారో చెప్పడం లేదు..

తనను ఎందుకు అరెస్టు చేశారో పోలీసులు చెప్పడం లేదని నవీన్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. కాగితాలపై సంతకాలు చేయాలని ఏసీపీ ఒత్తిడి చేశారని ఆరోపించారు. పోలీసుల తీరుపై అతని బంధువులు మండిపడ్డారు.

జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ దృష్టికి సమస్యలు


మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలపై కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి గళం విప్పారు. రాజేంద్రనగర్ ప్రధాన కార్యాలయంలో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో బహుళా అంతస్తుల నుంచి సరైనా ట్యాక్స్ రాబట్టడంలో అవినీతికి పాల్పడుతున్నారన్నారు. కొలతలు సరిగా తీసుకోకుండా డబ్బులు ఆశించి తక్కువ కొలతలు వేసి పన్నులు తీసుకుంటున్నారని ఆరోపించారు. అనేక బిల్డింగులు పర్మిషన్లు లేకుండా వెలుస్తున్నాయని, కొన్ని జీప్లస్ 2 పేరిట అనుమతి తీసుకొని జీప్లస్ 5 కడుతున్న అధికారులు దృష్టి సారించడం లేదని మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వాలు పేదలకు పక్కా ఇళ్లను అందించారు. వాటికి అసిస్‌మెంట్ చేస్తే బాగుంటుందని అడిగారు. అలాగే డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు త్వరగా అందేలా చూడాలని కోరారు.

కౌన్సెలింగ్‌తో సత్ఫలితాలు



గోల్కొండ: కౌన్సెలింగ్ ద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని గోల్కొండ ఓజన్ సదర్‌ఖాజీ మహ్మద్ అలీముద్దీన్ బైజీద్ హుస్సామీ అన్నారు. మంగళవారం టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని సదర్‌ఖాజీ కార్యాలయంలో ఆయన పలువురికి కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కార్యాలయంలో రెండు దశాబ్దాలుగా ఎన్నో దంపతుల సమస్యలను పరిష్కరించామన్నారు. హాజీ మహ్మద్ అబ్దుల్ రహీం రషీదీ, ఆఫేజ్ ఖాజీ మహ్మద్ హామేద్, ఆఫేజ్ ఖాజీ మహ్మద్ ఇస్మాయిల్ తదితరులున్నారు.

ఏసీపీ లక్ష్మీనారాయణకు సత్కారం


ఏసీపీ లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న నారాయణ ముదిరాజ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నారాయణ ముదిరాజ్ మంగళవారం రాజేంద్రనగర్ ఏసీపీ గా లక్ష్మీనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి శాలువాతో సత్కరించారు.

ఇద్దరు హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు అరుదైన గౌరవం


ప్రొఫెసర్ వీరేష్‌రావల్


ప్రొఫెసర్ అఖిల కుమార్ సాహూ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం కలిగింది. ప్రొఫెసర్లు వీరేష్‌రావల్, అఖిలకుమార్ సాహుకు ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా చైర్ ప్రొఫెసర్‌షిప్‌లను ప్రదానం చేయడం విశేషం. వీరిద్దరు హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలో విధులను నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీలో ఉన్న పెనమ్ లేబోరేటరీస్ లిమిటెడ్, బీటా లాక్టమ్ యాంటీబయాటిక్స్, ఏపీఐ ఫార్ములేషన్‌ల భారతదేశ ప్రఖ్యాత నిర్మాతలలో ఒకటి. పెనమ్ లేబరేటరీస్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పరాస్‌నాథ్‌పాండే హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలో రెండు చైర్ ప్రొఫెసర్ పోస్టులను ఏర్పాటు చేయడానికి ఒక ఎండోమెంట్ ఫండ్‌ను రూపొందించారు. అందులో ఒకటి ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతి చైర్ ప్రొఫెసర్‌షిప్ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ రెగ్యులర్ ఫ్యాకల్టీకి నెలకు రూ.25వేలు, సంవత్సరానికి లక్ష వేతనాలతో ఎంపిక చేసిన చైర్ పదవీకాలం గరిష్టంగా రెండు ఏళ్లు ఉండేలా ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా రెండవది ప్రొఫెసర్ గోవర్ధన్ మెహతా కెమిస్ట్రీలో అంతర్జాతీయంగా ప్రసిద్ధిచెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు/ప్రొఫెసర్లు విజిటింగ్ చైర్ ప్రొఫెసర్‌గా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఇలా నియమించబడిన ప్రొఫెసర్‌కు నెలకు లక్ష రూపాయలు పారితోషికం అందిస్తారు. హెచ్‌సీయూ వద్ద గెస్ట్‌హౌజ్ వసతి, వన్‌టైమ్ ఎకానమీ క్లాస్ ఎయిర్‌ట్రావెల్ కూడా చెల్లించబడుతుంది.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు

- రూ.7లక్షల కోట్లకు రూ.20 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోంది..
- మంత్రి శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మొయినాబాద్ రూరల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు ధ్వజమెత్తారు. హిమాయత్‌నగర్ సమీపంలోని ఓ ప్రైవేటు కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన ఏడు లక్షల కోట్ల అప్పులకు.. 20 వేల కోట్ల వడ్డీ కట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రకటించారు. ఒకటి రెండు రోజుల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు గ్యాస్ పథకాలకు శ్రీకారం చుట్టబోతున్నామని తెలిపారు. కాంగ్రెస్‌ను ఓడించడం చేతకాక బీజేపీతో పొత్తు అంటూ బీఆర్ఎస్ డ్రామాలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే ఓర్వలేక ఆటో డ్రైవర్లతో సమ్మె చేయిస్తున్నారని దుయ్యబట్టారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని వెల్లడించారు. ఎంపీ ఎన్నికల్లో 17 స్థానాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మాల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి జలమండలి ఉద్యోగులు


కాంగ్రెస్‌లో చేరిన జలమండలి ఉద్యోగులు

మణికొండ: హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ సెక్షన్ల జలమండలి ఉద్యోగులు రాష్ట్ర జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు చవ్వ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి న్యాయం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్‌లో అందరూ నష్టపోయారని, వారి హక్కుల ప్రకారం దక్కాల్సిన సౌకర్యాలు, వేతనాలు సైతం అందలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడం ప్రజా, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడంతో చేరేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.శ్రవణ్‌కుమార్, నాయకులు రాఘవేంద్రరాజ్, ఎన్ రాజేశ్‌ముదిరాజ్, రాములు, రవీందర్‌గౌడ్, జి.కృష్ణ, వెన్నెల కృష్ణ, బాల్‌రాజ్, సాయి, జి.రాజేశ్, భీంరావు, డి. సత్యనారాయణ కార్మికులు ఉన్నారు.

బంజారాల ఆర్యాధ ధైవం సేవాలాల్ మహారాజ్


మాట్లాడుతున్న ప్రముఖ సింగర్ ఎస్పీ నాయక్

ఏజీవర్సిటీ: బంజారాల ఆర్యాధ దైవం, బంజారా జాతీ కోసం ఆహర్నిశలు శ్రమించిన మహానీయుడు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని మొదటి గిరిజన మహిళా పైలెట్ అజ్మీరా బాబీ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సేవాలాల్ మహారాజ్ 285 జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ సింగర్ ఎస్పీ నాయక్, జయరాం స్వామి, రమేశ్ నాయక్, వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ నరేందర్‌రెడ్డి, టాసా అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రొఫెసర్స్ గోవర్ధన్ సుహాసిని, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ చిన్నా నాయక్, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమతాకుంభ్ ఉత్సవాలకు అంకురార్పణ


భక్తులకు ప్రవచనం చేస్తున్న చినజీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: సమతాకుంభ్–2024 ఉత్సవాలకు శ్రీరామనగరంలో శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి మంగళవారం అంకురార్పణ చేశారు. ఉదయం శ్రీ భగవద్రామానుజుల సువర్ణమూర్తికి ఉత్సవారంభ స్నపనం నిర్వహించారు. అనంతరం భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని విరాట్ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం కొనసాగించారు. చినజీయర్‌స్వామి చేసిన ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవాల్లో శ్రీ అహోబిల జీయర్‌స్వామి, శ్రీ దేవనాథ జీయర్‌స్వామి భక్తులకు ఆశీర్వాదం అందించారు.

